
# కనురెప్పల మాటున...

నీవేగా నా బ్రతుకు పూదోటలోకి చొరబడ్డావు
నీ రాక వసంతమేనని నేను పొరబడ్డాను
మన ప్రేమ శాశ్వతమని భ్రమపడ్డాను
ఊసులెన్నో పూసగుచ్చి చెప్పా
నువు చేసిన బాసలకు
సాక్షులెవరూ... విరజాజులు తప్ప!
కలల అలల తియ్యని కలవరం పుట్టించి
సుకుమార మనోభావాలను
కాలదన్ని వెళ్లిపోయావు
కోటి కోరికలు నాలో పెంచి
పీకలలోతు నీ ప్రేమలో నన్ను ముంచి
నువ్వు మాత్రం తేలిగ్గా వెళ్లిపోయావు
అసలు సుడిగాలిలా ఎందుకు
నన్ను చుట్టుముట్టావు?
నీ మదిలో నా తలపులను
ఎలా మట్టుబెట్టావు?
లేలేత భానుని కిరణాలు
గుర్తు తెస్తాయి నీ చుంబనాలు
ఉషోదయ చలిగాలి గిలిగింతలు
మరుపురానీవు నులివెచ్చని నీ కౌగిలింతలు!
నీ అనురాగ పూ రేకులతో నను అభిషేకించి
అపురూప అనుభవాల పల్లకీ ఎక్కించి
నా ఆనందాల ఆతిథ్యం తనివితీరా అనుభవించి
అందమైన వర్తమానాన్ని జ్ఞాపకాలుగా రాల్చేసి
భవిష్యత్తు ఆశల సౌధాన్ని పేకమేడలా కూల్చేసి
అతిథిలా నువ్వు వెళ్లిపోయావు
అచ్చెరువొంది నేనుండిపోయాను
నేను నీకు జ్ఞాపకమైనా రాను
నీవు నాకు మరుపైనా కావు
కన్నీటిని రెప్పల మాటున దాచిపెట్టి
మనసు ఘోషను మౌనంగా అదిమిపెట్టి
నా ప్రాణదీపం పదిలంగా చిదిమిపెట్టి
ఆఖరి క్షణం వరకూ ఎదురుచూస్తాను
నీకోసం నిశ్శబ్దంగా...

**- ఆర్.విజయ (పోచారం)**




# ప్రేమంటే...

ప్రేమంటే
పువ్విచ్చి ప్రపోజ్ చేయడం
వెంటబడి వేధించడం కాదు
ప్రేమంటే
సెల్‌ఫోన్లో గంటలకొద్దీ ఊసులాడడం
ఎడతెగని ఈ-మెయిల్స్ ప్రవాహం కాదు
ప్రేమంటే
బహుమతుల గాలమెయ్యడం కాదు
ప్రేమంటే మరీ ముఖ్యంగా
సంవత్సరానికోసారి జరుపుకొనే
మొక్కుబడి వేడుక కానే కాదు
ప్రేమంటే
రెండు మనసుల మధ్య అసంకల్పితంగా ఏర్పడే
అనుభూతుల వంతెన
అది వరమే తప్ప
ఎన్నటికీ శాపమవకూడదు
ప్రేమంటే
ఒకరి కోసమొకరు
ఆజన్మాంతం నెరవేర్చవలసిన బాధ్యత!

**- ప్రతాప వెంకటసుబ్బారాయుడు**
**(సికింద్రాబాద్)**

# నిన్నెలా శిక్షించమంటావు!?

శంఖమంటి మెడలో
మూడుముళ్ల పుస్తె కట్టిన
భాగ్యానికి మలినం అంటని
మనస్సు నాకు అర్పించావు
అగ్నిసాక్షిగ నాతో నడచి
తనువున సగముగ నిలచి
అర్ధనారీశ్వరానికి అర్థాన్నిచ్చావు
తలపై ముత్యాల తలంబ్రాలు
గుమ్మరిస్తే రత్నాల బిడ్డలకి
మురిపాల తండ్రిని చేశావు
ప్రేమని వండి వడ్డించి



వెండి వెన్నెల్లో గోరుముద్దలు
తినిపించి నన్ను కూడా
ఓ చిన్ని పాపాయిని చేశావు
ఇంతా చేసి ఏ పాపం ఎరుగని
నన్ను అందరూ కొంగుచాటు
కృష్ణుడని చెప్పుకుంటుంటే
అటువైపు తిరిగి నవ్వుకుంటావు
నను తీయని బాధకు గురిచేసిన
నేరానికి నిన్నెలా శిక్షించమంటావు!?

**- పింగళి శ్రీనివాసరావు (గుంటూరు)**